జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

మంగళవారం
10-11-2026

సంపుటి 1 | సంచిక 347

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647

(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)

హైదరాబాద్‌లో పెరిగిన వాయు కాలుష్యం

దీపావళి తర్వాత ప్రమాదకర స్థాయికి చేరిన ఏక్యూఐ.. ప్రకాశ్‌నగర్‌లో 828కు చేరిన కాలుష్య సూచీ


కూకట్‌పల్లి, బిక్షపతి నగర్‌లోనూ తీవ్ర ప్రభావం.. పీఎం2.5 ధూళి కణాలతో ఆరోగ్యంపై ఆందోళన



దశ, హైదరాబాద్: దీపావళి వేడుకల అనంతరం హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. బాణసంచా కాల్చడం, వాహనాల పొగ, నిర్మాణ పనుల నుంచి వెలువడే దుమ్ము, పారిశ్రామిక కాలుష్యం తదితర కారణాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత గణనీయంగా పడిపోయింది. నవంబర్ 8న నమోదైన గణాంకాల ప్రకారం హైదరాబాద్ నగర సగటు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 321గా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో ఈ స్థాయి మరింత ఎక్కువగా ఉంది. ఏక్యూఐ.ఇన్ వెల్లడించిన వివరాల ప్రకారం ప్రకాశ్‌నగర్ స్టేషన్2లో అత్యధికంగా 828 ఏక్యూఐ నమోదైంది. కూకట్‌పల్లిలో 628, బిక్షపతి నగర్‌లో 625, జనార్దన హిల్స్‌లో 532 స్థాయికి కాలుష్యం చేరింది. గజులరామారం, ప్రగతినగర్, కేపీహెచ్‌బీ ఫేజ్ 1 ప్రాంతాల్లోనూ సుమారు 486 నుంచి 487 మధ్య ఏక్యూఐ నమోదైంది.

ఇక సెరిలింగంపల్లిలో 475, బాచుపల్లిలో 465, షిర్డీసాయి నగర్‌లో 450, చిత్తారిపురి కాలనీలో 430, నల్లగండ్లలో 423గా నమోదైంది. మరోవైపు కోకాపేట స్టేషన్1లో 196, అప్పర్‌పల్లిలో 182, ఏడబ్ల్యూహెచ్ఓ కాలనీలో 174 స్థాయిలో నమోదైనట్లు నివేదిక పేర్కొంది. నగరంలో పీఎం2.5 స్థాయి

..మిగతా 4వ పేజీలో ➔



ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 359 పీజీ సీట్లు పెంపు

దశ, హైదరాబాద్: తెలంగాణలో వైద్య విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు శుభవార్త. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పీజీ వైద్య సీట్లు 359 పెరిగాయి. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నవంబర్ 6న విడుదల చేసిన తాజా సీట్ల వివరాల ప్రకారం రాష్ట్రంలోని 23 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం 1,625 పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గత సెప్టెంబర్ 29న విడుదల చేసిన జాబితాలో 1,266 సీట్లు ఉండగా, తాజా జాబితాలో మరో 359 సీట్లు పెరిగాయి. రాష్ట్రంలోని మొత్తం 35 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 23 కళాశాలలకు పీజీ కోర్సులు నిర్వహించే అవకాశం లభించింది. ముఖ్యంగా గతంలో పీజీ కోర్సులు లేని 13 ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ కొత్తగా సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ 13 కళాశాలల్లో కలిపి 243 సీట్లు ఉన్నాయి. జిల్లాల వారీగా చూస్తే జనగామ వైద్య కళాశాలలో అత్యధికంగా 48 సీట్లు, కరీంనగర్‌లో 34, కామారెడ్డిలో 32, ఖమ్మంలో 25, సంగారెడ్డిలో 18, మంచిర్యాలలో

..మిగతా 4వ పేజీలో ➔

2028 డిసెంబర్ నాటికి కొడంగల్‌కు

కృష్ణా జలాలు

పాలమూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. వలసలకు చరమగీతం పాడుతాం

కొడంగల్‌లో రూ.9,053 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రజాబలం కార్యక్రమం: సీఎం రేవంత్‌రెడ్డి



దశ, కొడంగల్, నవంబర్ 9: గత ప్రభుత్వం చేసిన అప్పులను ఒకవైపు చెల్లిస్తూనే, మరోవైపు రాష్ట్రంలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా కరువు, వలసలతో సతమతమవుతున్న పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. 2028 డిసెంబర్ నాటికి కృష్ణా నది జలాలతో కొడంగల్ ప్రాంతంలోని భూములను తడిపి పచ్చని పంటలు పండించే బాధ్యత తనదేనని పోలేపల్లి ఎల్లమ్మ తల్లి సాక్షిగా హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల ఇండస్ట్రియల్ పార్కులో సోమవారం నిర్వహించిన 'రైతన్నతో ఆత్మీయ సభ'లో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అంతకుముందు నియోజకవర్గ పరిధిలో రూ.9,053 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రైతులతో కలిసి పాదయాత్రగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

గత 70 ఏళ్లుగా పాలమూరు ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం అన్నారు. ఎంతోమంది నాయకులు అధికారంలోకి వచ్చినా ఈ ప్రాంతంలో వలసలు ఆగలేదని, రైతులకు సాగునీరు అందక పంటలు పండని పరిస్థితి కొనసాగిందని పేర్కొన్నారు. భీమా,

..మిగతా 4వ పేజీలో ➔



13 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు

పవన్ కల్యాణ్, అన్నా కొణిదెల విడిపోవాలని నిర్ణయం

పిల్లల సంక్షేమమే తమ ప్రాధాన్యమని ప్రకటన

అమరావతి, నవంబర్ 9: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ 13 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అవగాహన, గౌరవంతోనే విడిపోవాలని నిర్ణయం తీసుకున్నట్లు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. జీవితంలో ఒక ముఖ్యమైన భాగాన్ని కలిసి గడిపిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. వివాహ బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతామని, పిల్లలకు అంకితభావంతో కూడిన తల్లిదండ్రులుగా ఉంటామని తెలిపారు. తమ పిల్లల సంతోషం, సంక్షేమమే ఇకపై కూడా ఉమ్మడి ప్రాధాన్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ వ్యక్తిగత పరిణామం నేపథ్యంలో తమ గోప్యతను గౌరవించాలని స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేశారు. ఇన్నాళ్లూ తమకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పవన్ కల్యాణ్ 2013 సెప్టెంబర్‌లో అన్నా లెజ్నేవాను వివాహం చేసుకున్నారు. వీరికి పోలెనా అంజనా పవనోవా, మార్క్ శంకర్ పవనోవిచ్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంతకుముందు 1997లో నందినిని వివాహం చేసుకున్న పవన్ కల్యాణ్ 2008లో ఆమె నుంచి విడాకులు పొందారు. అనంతరం 2009లో నటి రేణు దేశాయ్‌ను వివాహం చేసుకున్నారు. వీరిద్దరూ 2012లో విడిపోయారు. వీరికి అకీరా నందన్, ఆద్య అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొత్తంగా పవన్ కల్యాణ్‌కు మూడు వివాహాలు కాగా, నలుగురు సంతానం ఉన్నారు.

క్యాన్సర్ రోగులకు భారీ ఊరట

137 రకాల ఔషధాల ధరలు తగ్గింపు..

దశ, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఖరీదైన క్యాన్సర్ చికిత్సతో ఇబ్బందులు పడుతున్న రోగులకు ఉపశమనం కలిగించేలా 137 రకాల క్యాన్సర్ ఔషధాల ధరలను భారీగా తగ్గించింది. ఈ మేరకు జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను గరిష్ఠంగా 30 శాతానికి పరిమితం చేస్తూ కొత్త ధరలను నిర్ణయించింది. తాజా నిర్ణయంతో కొన్ని ఔషధాల గరిష్ఠ విక్రయ ధరల్లో 96.45 శాతం వరకు తగ్గింపు లభించింది. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే 'పాల్‌బోప్రో' ఔషధం ధర గతంలో రూ.40,421 ఉండగా, ప్రస్తుతం రూ.2,720కు తగ్గింది. అలాగే ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 'అబిరోన్' ధర రూ.41,250 నుంచి రూ.3,218కు పడిపోయింది. దీంతో ఆయా మందులను వినియోగించే రోగులకు గణనీయంగా ఖర్చు తగ్గనుంది. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు ప్రధాన భారంగా మారుతున్న నేపథ్యంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. దీర్ఘకాలిక చికిత్స అవసరమయ్యే రోగులు, వారి కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఉపశమనం కలగనుంది.

మరోవైపు తగ్గించిన ధరల వివరాలను ఆసుపత్రులు, రిటైలర్లు, ఔషధ డీలర్లు తమ విక్రయ కేంద్రాల్లోని నోటీసు బోర్డులతో పాటు వెబ్‌సైట్లలోనూ తప్పనిసరిగా ప్రదర్శించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణయించిన ధరలకే మందులు విక్రయించాలని స్పష్టం చేసింది. అధిక ధరలకు విక్రయిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

యాదగిరిగుట్టలో ఘనంగా స్వాతి నక్షత్ర విశేష పూజలు



దశ, యాదాద్రి భువనగిరి: స్వాతి నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి క్షేత్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్వాతి నక్షత్రం శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారికి అత్యంత విశిష్టమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో యాదగిరిగుట్టకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి నామస్మరణతో గిరిప్రదక్షిణ కొనసాగింది. భక్తులు భక్తిపారవశ్యంతో ప్రదక్షిణ చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ప్రార్థించారు.

చార్జిషీట్ల కోసం రూ.2 లక్షల లంచం!

ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన కీసర ఎస్ఐ శ్రీనివాస్

భూ మోసం, 498ఏ కేసుల్లో చార్జిషీట్ల దాఖలుకు డబ్బుల డిమాండ్

దశ, మేడ్చల్: రెండు కేసుల్లో చార్జిషీట్లు త్వరగా దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేసిన కీసర పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం కీసరలోని శిల్పా లేఅవుట్ సమీపంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా పోలీస్ శాఖలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. భూ మోసం, 498ఏ కేసులకు సంబంధించిన చార్జిషీట్లు త్వరగా దాఖలు చేయాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాస్ బాధితుడిపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై స్పందించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ఇందులో భాగంగా సోమవారం శిల్పా లేఅవుట్ వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్ఐను పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తదుపరి న్యాయపరమైన చర్యల్లో భాగంగా న్యాయమూర్తి ఎదుట



హాజరుపరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పోలీస్ శాఖలో వరుస ఏసీబీ కేసులు

గత 3 నెలల వ్యవధిలోనే ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి లంచం కేసుల్లో పట్టుబడినట్లు సమాచారం. తాజాగా కీసర ఎస్ఐ ఘటనతో శాఖలో అవినీతి ఆరోపణలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ప్రజలకు సేవలందించాల్సిన పోలీసు అధికారులే లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మైలార్‌దేవ్‌పల్లిలో వరుస అగ్నిప్రమాదాలు

- కాటేదాన్‌లో ప్లాస్టిక్ కంపెనీ, దాసరి బస్తీలో డెకరేషన్ గోదాంలో మంటలు
- ఫైర్ స్టేషన్ లేక స్థానికుల్లో ఆందోళన
- భద్రతా నిబంధనలు పట్టించుకోని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



దశ, రంగారెడ్డి: దీపావళి పండుగ వేళ రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో వరుస అగ్నిప్రమాదాలు కలకలం రేపాయి. కాటేదాన్ పారిశ్రామికవాడలోని హెచ్‌కే ప్లాస్టిక్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరగగా, మరోవైపు దాసరి బస్తీ సమీపంలోని డెకరేషన్ గోదాంలోనూ మంటలు చెలరేగాయి. ఒకేరోజు రెండు చోట్ల అగ్నిప్రమాదాలు చోటుచేసుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల మధ్యలో ఉన్న డెకరేషన్ గోదాంలో మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల నివాసితులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. ప్లాస్టిక్ కంపెనీలో చెలరేగిన మంటలు భారీగా వ్యాపించడంతో పారిశ్రామిక ప్రాంతంలో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలాలకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.

మరోవైపు మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతంలో ఫైర్ స్టేషన్ లేకపోవడం, నివాస ప్రాంతాల మధ్య ప్రమాదకర గోదాంల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే వ్యాపార సంస్థలు, గోదాంలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అగ్నిమాపక భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి



దశ, నర్సంపేట: దీపావళి పండుగ సందర్భంగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్‌తో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, పలు సమకాలీన అంశాలపై గవర్నర్‌తో కొద్దిసేపు చర్చించారు. పండుగ వేళ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

కిషన్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు

మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి దంపతుల మర్యాదపూర్వక భేటీ



దశ, ఓయూ: కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయనకు మిఠాయిలు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రజలందరి జీవితాల్లో దీపావళి పండుగ మరిన్ని వెలుగులు నింపాలని ఈ సందర్భంగా కార్తీక చంద్రారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బంగారు శృతి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేపర్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



దశ, ఓయూ: సీతాఫల్‌మండి రైల్వే జూనియర్ కాలేజ్ వెనకాల ఉన్న ఓ పేపర్ గోడౌన్‌లో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అది న్యూస్ పేపర్లు పాత పేపర్లు అట్టపెట్టెల గోదాం కావడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి. దీంతో రైల్వే జూనియర్ కాలేజ్ రవీంద్ర నగర్, సీతాఫల్‌మండి పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. ఈ మేరకు కు సమాచారం అందుకున్న మౌలాలి ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఎగిసిపడుతున్న మంటలను ఆర్పారు. దీపావళి పండుగ సందర్భంగా టపాసులు పేలుస్తుండగా ఎక్కడి నుంచో రాకెట్ వచ్చి పేపరు, అట్టపెట్టెల గోదాం పై పడటంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్టుగా ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నిర్ధారించారు. ఇలాంటి ప్రాణం నష్టం జరగలేదు. నీ గోదాము స్థానిక బిజెపి నాయకులు ఆకుల సంపత్ పేపర్ గోదాముగా గుర్తించారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

మాణికేశ్వరి నగర్‌లో చిత్రపటానికి క్షీరాభిషేకం.. కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ



దశ ఓయూ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వరి నగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాణికేశ్వరి నగర్ కమాన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆదం సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేసి, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్, లింగయ్య, కే. నరసింహ, జీ. వెంకటేష్, వర్కుప్పల రవి, అశోక్, అనిల్‌కుమార్, రాజేశ్వర్, రాజేష్, రషీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



- నల్లబెల్లి బస్టాండ్ వద్ద దళిత, బహుజన సంఘాల నిరసన ధర్నా
- ఆర్టీసీ డిపో మేనేజర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్



దశ, నర్సంపేట: నల్లబెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను తొలగించాలనే ప్రతిపాదనను అధికారులు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (MRPS) మండల అధ్యక్షుడు గన్నారపు అఖిల్ మాదిగ మాట్లాడుతూ—— నల్లబెల్లి మండల బస్టాండ్ ప్రాంగణంలో గత కొన్నేళ్లుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను తొలగించాలంటూ నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహనీయుల విగ్రహాలు యావత్ సమాజానికి ఆదర్శప్రాయమని, అలాంటి స్ఫూర్తిప్రదాతల చిహ్నాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవడంతో పాటు, డిపో మేనేజర్ దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగేళ్లి జ్యోతి ప్రకాష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జన్ను ప్రవీణ్ మాదిగ, ఉపాధ్యక్షుడు కనకం భరత్ మాదిగ, ప్రధాన కార్యదర్శి దండు ప్రవీణ్ మాదిగ, కార్యదర్శి పొడేటి సునీల్ మాదిగ, సీనియర్ నాయకులు పరిగి రత్నం మాదిగ, పరికి కోర్నెల్ మాదిగ, జన్ను జయరావు మాదిగ, బట్టు సాంబయ్య, పొడేటి సాగర్ మాదిగ, మనుగొండ సూర్యపవన్ మాదిగ, నాగేళ్లి అనిల్ మాదిగ, కనకం నవీన్ మాదిగ, నాగేళ్లి ప్రకాష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


రిటైల్ వ్యాపారులకు నేరుగా బియ్యం సరఫరా

- కిలో రూ.62కే కేఎన్ఎం.. రూ.74కు జేఎస్ఆర్ బియ్యం



దశ, ఓయూ: జిల్లాలోని రిటైల్ వ్యాపారులకు బియ్యం కొరత లేకుండా నేరుగా సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు ముందుకొచ్చినట్లు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.62, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.74 చొప్పున సరఫరా చేసేందుకు మిల్లర్లు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిపింది. రిటైల్ వ్యాపారులు బియ్యం కోసం హోల్‌సేల్ వ్యాపారులు, బ్రోకర్లు, మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. బియ్యం కొనుగోలు చేయాలనుకునే వ్యాపారులు తమ దుకాణం పేరు, చిరునామా, జీఎస్టీ నంబరు, కావాల్సిన బియ్యం రకం, పరిమాణం, మొబైల్ నంబరు వివరాలను జిల్లా పౌరసరఫరాల అధికారులకు అందజేయాలని సూచించింది. వ్యాపారుల నుంచి వివరాలు సేకరించి మిల్లర్ల ద్వారా నేరుగా దుకాణాలకు బియ్యం సరఫరా చేసేలా సమన్వయం చేస్తామని పేర్కొంది. బియ్యం నిల్వలు, సరఫరాపై వ్యాపారులు ఆందోళన చెందవద్దని, అనవసరంగా ముందస్తు నిల్వలు చేసుకోవద్దని పౌరసరఫరాల శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రజావాణికి 26 ఫిర్యాదులు.. పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



దశ, రంగారెడ్డి: ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 26 ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అందిన 26 దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 19, ఇతర శాఖలకు సంబంధించి 7 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ కె. కిరణ్మయి, చంద్రారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్

దశ, రుద్రంగి: జూదం ఆడుతూ తోమ్మిది మంది పోలీసులకు పట్టుబడిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ మోతీరామ్ ఇచ్చిన సమాచారం మేరకు రుద్రంగి గ్రామంలో జూదం ఆడుతున్న 9 మంది అరెస్ట్ వారిపై కేసు నమోదు చేసామని, మధ్యాహ్న సమయంలో గ్రామంలోని ఓ ఇంటిలో కొంతమంది జూదం ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం తన సిబ్బందితో కలిసి అట్టి ఇంట్లోకి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ 9 మంది వ్యక్తులు జూదం ఆడుతున్నారని, వెంటనే వారిని పట్టుకుని వారి వద్ద నుంచి ఒక లక్ష నలుపై నాలుగు వేల ఐదు వందల ఇరువై రూపాయల నగదు, తొమ్మిది సెల్ ఫోన్లు, జూద ఆటకు సంబంధించిన సామాగ్రిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసామని ఎస్ఐ అన్నారు. ఇక ముమదు ఎవరైనా రుద్రంగి మండల పరిధిలో జూదం ఆడితే సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, జూదం వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మోతి రామ్ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం, గౌరీ పూజ



- కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించిన బీజేపీ నాయకుడు పోతగాని గోపాల్ గౌడ్

దశ ఓయూ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆదివారం తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, గౌరీ పూజలను ఆచరించారు. అనంతరం ఇంటి ఆవరణలో టపాసులు కాల్చి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు, ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా నాచారం హెచ్ఎంటీ నగర్ డివిజన్ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.


అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

❖ జిల్లా ఏఐటియుసి అధ్యక్షురాలు సిహెచ్.ఝాన్సీరాణి



దశ, కామేపల్లి: (నవంబర్ 09) : సీఎం రేవంత్ రెడ్డి అంగన్వాడీలకు ఇచ్చిన హామీ లను తక్షణమే అమలు చేయా లని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసి యేషన్ (ఏఐటియుసి) జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.ఝాన్సీ రాణి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన కామేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ..అంగన్వాడీలకు ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి కనీస వేతనం రూ.18,000 వేలు అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయకపోవడం బాధాకరం అన్నారు. హామీ ఇచ్చి మూడేళ్లు అయినా నేటి వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం మరి విడ్డూరంగా ఉందన్నారు. అంగన్వా డీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని, టీచర్లు,హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని, పిఎఫ్,హెల్త్ కార్డ్స్, భీమా రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు.పెండింగ్ బకాయిలను వెంటనే అందిం చాలని కోరారు. ఐసిడిఎస్ను రెగ్యులరైజ్ చేయాలని, టీచర్లకు,హెల్పర్లకు ప్రతినెల 1వ,తేదీ న వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10,00,00 లక్షల రూపాయలను అందిం చాలని, పెండింగ్ లో ఉన్న టిఏ, డిఏలను మంజూరు చేయాలని కోరారు. ప్రీ ప్రైమరి పాఠశాలలు రద్దు చేయాలని, గ్రేడ్2 సూపర్వైజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయా లని అన్నారు.హెల్పర్లకు కనీస వేతనం రూ.10,000 వేలు ఇవ్వాలని,పెండింగ్ లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్స్, ఆరోగ్యలక్ష్మి, ఈవెంట్స్ బిల్స్ అందించాలని కోరారు.

డ్యూటీలో కానీ,ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం కోల్పోయిన వారి కుటుంబంలో తక్షణమే ఉద్యోగం కల్పించాల ని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల కు ప్రభుత్వం టాయిలెట్స్, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం తక్షణమే కల్పించాలని తెలిపారు. ప్రతి నెల ప్రాజెక్టు మీటింగులను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఆదిలక్ష్మి, బసవమ్మ,వి.జ్యోతి, హెచ్.కమల, బి.చంద్రకళ, ఇ.బేబీ, జి.ఝాన్సీ,యం.లక్ష్మి, భాగ్యమ్మ, కె.శిరోమణి, యు. కమలమ్మ,తదితరులు పాల్గొన్నారు.



రహదారి పనులు ప్రారంభం

❖ ఆసుపాక–నారాయణపురం దెబ్బతిన్న రహదారుల
❖ పునరుద్ధరణకు ఎమ్మెల్యే జారె ప్రత్యేక చొరవ
❖ ప్రారంభించిన సర్పంచ్ సోడెం ఆదిలక్ష్మి

దశ, అశ్వారావుపేట: ఇటీవల కురిసిన ముసురు వర్షాలకు దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులు మండలంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవతో మండలంలోని పలు రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. వర్షాల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో రహదారుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆసుపాక- నారాయణపురం పంచాయతీలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి పనులను సోమవారం ఆసుపాక సర్పంచ్ సోడెం ఆదిలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రహదారి దెబ్బతినడంతో వాహనదారులు, గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి రాకపోకలకు సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు.

నేటి నుండి వైభవంగా కార్తీకమాస ఉత్సవాలు

కామేపల్లి ఆలయ కమిటీ చైర్మన్ గొట్టుపర్తి శివాజీ



దశ, కామేపల్లి: శివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాస ఉత్సవాలు ఈ నెల 10న, మంగళవారం ఉదయం నుండి ప్రారంభమ వుతున్నట్లు కామేపల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ గురు హరిహర మందిరంలో జరిగే ఉత్సవాల్లో శివునికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు, హోమాలు జరుగుతాయని వెల్లడించారు. భక్తులు ఈ కార్యక్ర మాల్లో అధిక సంఖ్యలో పాల్గొని శివుని కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

సాఫ్ట్‌బాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టుకు ప్రథమ స్థానం



దశ, బెల్లంపల్లి: 70వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్19 సాఫ్ట్‌బాల్ కళాశాల క్రీడా పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. సికింద్రాబాద్‌లోని భవాన్స్ అరబిందో జూనియర్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. లీగ్ మ్యాచ్‌లలో ఆదిలాబాద్ జట్టు ఖమ్మంపై 42, కరీంనగర్‌పై 40, నల్గొండపై 60 స్కోరుతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. నిజామాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 35 తేడాతో ఓటమి పాలైంది. సెమీఫైనల్‌లో వరంగల్ జట్టుపై 40 స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్ పోటీలో నిజామాబాద్ జట్టుతో తలపడి 40 స్కోరుతో విజయం సాధించి రాష్ట్రస్థాయి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ అండర్19 సెక్రటరీ బి. బాబురావు క్రీడాకారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీలకు అల్లూరి వామన్, కోట యాదగిరి కోచ్‌లు, మేనేజర్లుగా వ్యవహరించారు.



అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పన

❖ ముసాయిదా జాబితాలో పేర్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలి
❖ ఓటు హక్కు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

దశ, హైదరాబాద్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2026లో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన అర్హులైన ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. గైర్హాజరు, వలస, మరణం, నకిలీ నమోదు వంటి కారణాలతో జాబితాలో చోటు దక్కని అర్హులైన ఓటర్లు తమ వివరాలతో కూడిన ఎన్నికల ఫారాలను మరోసారి పూర్తి చేసి సంబంధిత బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని సూచించారు.

ఇప్పటివరకు ఫారాలు అందని ఓటర్ల బూత్‌ల వారీ జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాలు, ఇతర ప్రధాన బహిరంగ ప్రదేశాల్లో మరోసారి ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఓటరు నివాసం మారకుండా అదే ప్రాంతంలో కొనసాగుతున్నప్పటికీ గతంలో ఫారం సమర్పించని వారు అందుకు గల కారణాలను వివరిస్తూ అనుబంధం-బీ ఫారాన్ని జతచేయాలని సూచించారు. పూర్తి వివరాలతో నింపి సంతకం చేసిన ఫారాన్ని సంబంధిత అధికారులకు నేరుగా లేదా కుటుంబంలోని వయోజన సభ్యుల ద్వారా అందజేయవచ్చని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే సమయంలో ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువసార్లు ఓటరు జాబితాలో నమోదుకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచూసుకోవాలని ఆమె కోరారు.

కార్తీకమాస పూజలకు ముస్తాబైన చెరువుగట్టు ఆలయం



దశ, మునగాల: పరమశివునికి ప్రీతికరమైన పవిత్ర కార్తీక మాస విశేష పూజలకు మండల కేంద్రంలోని చెరువుగట్టు పార్వతి గంగాధర స్వామి (చెరువుగట్టు) శివాలయం ముస్తాబయింది. మునగాల మండల కేంద్రంలోని చెరువుగట్టు శివాలయంనందు స్వయంభుగా వెలసిన పార్వతి గంగాధర స్వామి దేవాలయంలో పవిత్రకార్తీక మాసం నెలరోజులపూజ కార్యక్రమాలు నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధానఅర్చకులు వారణాసి బుచ్చి రామయ్య శాస్త్రి, వారణాసి కిషోర్ శాస్త్రీలు తెలిపారు. నవంబర్ 10న మంగళవారం నుండి ప్రతిరోజు సాయంత్రం వేళ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆకాశదీపం వెలిగించనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా నవంబర్ 24న కార్తీక పౌర్ణమి రోజు స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించనున్నామని, సాయంత్రంవేళ జ్వాలాతోరణం నిర్వహిస్తామన్నారు. ప్రతిసోమవారం స్వామివారికి విశేషమైన అభిషేకాలు, పూజలు, హోమాలు మరియు అన్నాభిషేకం నిర్వహిస్తూ నెలరోజులపాటు దేవాలయం నందు భక్తుల సహకారంతో విశేషమైనప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మృతి చెందిన టీచర్ కుటుంబానికి అండగా తోటి ఉపాధ్యాయులు

❖ 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేత



దశ, మునగాల: తమతోపాటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుటుంబానికి తోటి ఉపాధ్యాయులంతా అండగానిలిచి, ఆర్థికసహకారం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు మునగాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం పొందిన కొండేటి సైదులు కుటుంబానికి, మునగాల మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం తరపున 40వేల రూపాయలు, మునగాల గ్రామ సర్పంచ్ నల్లపాటి ప్రమీల తరపున10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని జమచేసి, మొత్తం 50 వేల రూపాయలను పాఠశాల ఉపాధ్యాయ బృందం, సోమవారం,సైదులు నివాసంలో, సైదులు భార్య, కుమారుడికి అందజేశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వీరబాబు మాట్లాడుతూ, తోటి ఉపాధ్యాయుడి అకాల మరణంతో తీవ్రవిషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఇతరశ్రేయోభిలాషులు ముందుకు వచ్చి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తూ భరోసాకల్పించినట్లు తెలిపారు.

ఏఐకేఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

❖ నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో మహాసభలు
❖ సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్

దశ, జనగామ: అఖిల భారత కిసాన్ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న మహాసభల వాల్‌పోస్టర్‌ను సోమవారం జనగామలోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు అవసరమన్నారు. రైతాంగ హక్కులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమం, రైతు కూలీల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద, వలసవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల నేపథ్యంలో 1936లో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించిందని, 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటోందని పేర్కొన్నారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పురిటిగడ్డగా నిలిచిన నల్లగొండలో తొలిసారిగా జాతీయ మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. నవంబర్ 15న లక్ష మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు మాజీ ఎంపీ బృందా కారత్‌తో పాటు జాతీయ నాయకులు హాజరవుతారని, దేశవ్యాప్తంగా సుమారు 1,500 మంది రైతు ఉద్యమ నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమ కార్యాచరణ రూపొందించే ఈ మహాసభలను విజయవంతం చేయడానికి రైతు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ అజారుద్దీన్, కళ్యాణం లింగం, నాయకులు కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు

❖ లబ్ధిదారుల కొత్త ఇళ్లలో దీపాల వెలుగులు
❖ కుటుంబాలతో కలిసి పండుగ వేడుకల్లో అధికారులు



దశ, కడ్తాల్: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం వాసుదేవ్‌పూర్ గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ ఆనందాన్ని నింపాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులోభాగంగా వాసుదేవ్‌పూర్‌లోని లబ్ధిదారులు ఎర్ర సునీత, శివకుమార్ తమ కుటుంబ సభ్యులతో కలిసి నూతన ఇంటి ముందు దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. అలాగే చెన్నారం తండాలో కేతావత్ లక్ష్మిభాయి, కిషన్ నాయక్ ఇంటి వద్ద కూడా వేడుకలు నిర్వహించారు. మండల సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ సాయికిరణ్ ప్రత్యేక అధికారి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపాలు వెలిగించి సంబరాల్లో పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్ కేతావత్ రమేష్ నాయక్, ఉపసర్పంచ్ ఎర్ర రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి చోటే, లబ్ధిదారురాలి తండ్రి ఎర్ర నర్సింహా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని లబ్ధిదారురాలు సునీత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులు లబ్ధిదారుల కుటుంబాలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాత్లావత్ లచ్చిరాం నాయక్, మాజీ సర్పంచులు నరేందర్ నాయక్, మల్లెకేడి శివాజీ, వార్డు సభ్యురాలు కేతావత్ రాజేశ్వరి రాజేందర్, గ్రామ పెద్దలు పాత్లావత్ లక్ష్మణ్, కృష్ణాజీ, సైదులు, విఠల్, శ్రీను, రాజు, రమేష్,కేతావత్ రాజు,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి వేడుకల్లో ఆదివాసీల సందడి

❖ సంప్రదాయ నృత్యాలు, డోలు వాయిద్యాలతో సంబరాలు
❖ సంస్కృతి, ఆచారాల పరిరక్షణకు సర్పంచుల పిలుపు



దశ, ములకలపల్లి: (నవంబర్ 09) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం రాచన్నగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని సాకువాగు గ్రామంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ, భద్రాచలం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 1నుంచి 15వతేదీవరకు నిర్వహిస్తున్నవేడుకల్లో భాగంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి రాచన్నగూడెం, మూకమామిడి గ్రామపంచాయతీల పరిధిలోని ఆదివాసీలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డోలు వాయిద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, మూకమామిడి సర్పంచ్ కొరస ఆదిలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి, ఆశయాలను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గిరిజనులసంస్కృతి,సంప్రదాయాలు,కులఆచారాలు, కట్టుబాట్లు కనుమరుగుకాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజన విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిర్సా ముండా స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్పంచులు,కళాకారులు గిరిజన సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డోలు వాయిద్యాల నడుమ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. సంప్రదాయ వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పెద్దలు, సర్పంచులు, కార్యదర్శిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

హైదరాబాద్‌లో టపాసుల వివాదం..

కత్తులతో దాడి.. ముగ్గురిపై హత్యాయత్నం

రోడ్డుపై వెళ్తున్న చిన్నారిపై టపాసు విసరడంతో వివాదం..

దశ, హైదరాబాద్



హైదరాబాద్ నగరంలోని పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో టపాసులు పేల్చే విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. చిన్నారిపై టపాసు విసరడాన్ని ప్రశ్నించినందుకు ముగ్గురు వ్యక్తులపై కత్తులతో దాడి జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ గాయపడ్డారు.

చిన్నారిపై టపాసు విసరడంతో మొదలైన గొడవ : అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పటేల్‌నగర్, గాంధీభవన్ ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న ఓ చిన్నారిపై కొందరు వ్యక్తులు టపాసు విసిరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గమనించిన చిన్నారి మేనమామ వారిని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో వివాదం తీవ్రరూపం దాల్చింది.

సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు కత్తులతో దాడి : చిన్నారిపై టపాసు విసిరిన విషయాన్ని ప్రశ్నించడంతో మొదలైన గొడవలో సల్మాన్, అర్బాజ్‌తో పాటు మరికొందరు వ్యక్తులు ముగ్గురిపై కత్తులతో దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ దాడిలో షేక్ వహీద్, షేక్ ఇమ్రాన్, షేక్ షాబాజ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడి అనంతరం స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు వారికి చికిత్స అందిస్తున్నారు.

బేగంబజార్ పోలీసుల దర్యాప్తు: ఘటనపై సమాచారం అందుకున్న బేగంబజార్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘర్షణకు అసలు కారణాలు ఏమిటి? దాడిలో ఎవరెవరు పాల్గొన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

వివాదాలతో ప్రాణాలు తీసుకోవద్దు!

పండుగల సమయంలో టపాసులు కాల్చేటప్పుడు చిన్నారుల భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా టపాసులు విసరడం ప్రమాదకరం. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ప్రశ్నించాలి తప్ప, కత్తులతో దాడులకు దిగడం ఏమాత్రం సమర్థనీయం కాదు. చిన్నపాటి వివాదాలు ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయడం సమాజానికి ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి.

హైదరాబాద్‌లో పెరిగిన వాయు కాలుష్యం

మొదటి పేజీ తరువాయి

క్యూబిక్ మీటరుకు 223 మైక్రోగ్రాములు, పీఎం10 స్థాయి 264 మైక్రోగ్రాములుగా నమోదైంది. పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాలు శ్వాసకోశంలోకి లోతుగా ప్రవేశించే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మరోనివేదికలో నవంబర్ 9న రవి కాలనీ ప్రాంతంలో ఏక్యూఐ 995 వరకు నమోదైనట్లు వెల్లడైంది. అయితే ఈ గణాంకాలు వేర్వేరు పర్యవేక్షణ కేంద్రాలు, వేర్వేరు సమయాల్లో నమోదైనవి కావడంతో వాటిని నగర సగటు కాలుష్యంగా పరిగణించరాదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీపావళి సందర్భంగా బాణసంచా నుంచి వెలువడే పొగ వాయు కాలుష్యానికి ఒక కారణమైనప్పటికీ, నగరంలో ఇప్పటికే ఉన్న వాహనాల రద్దీ, నిర్మాణ రంగం నుంచి వెలువడే దుమ్ము, పారిశ్రామిక ఉద్గారాలు కూడా కాలుష్య తీవ్రతకు దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాలుష్యం అధికంగా ఉన్న సమయంలో బయట ఎక్కువసేపు ఉండకూడదని, అవసరమైతే మాస్కులు ధరించాలని, శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 359 పీజీ సీట్లు పెంపు

మొదటి పేజీ తరువాయి

15 సీట్లు ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి కళాశాలల్లో 12 చొప్పున, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్‌లో 10 చొప్పున, నర్సంపేటలో 8, రాజన్న సిరిసిల్లలో 7 సీట్లు కేటాయించారు. ఇప్పటికే పీజీ కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలల్లో ఉస్మానియా మెడికల్ కాలేజీలో 501, గాంధీ మెడికల్ కాలేజీలో 228, కాకతీయ మెడికల్ కాలేజీలో 192 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, డీమ్డ్ వైద్య కళాశాలలను కలిపి మొత్తం 4,417 పీజీ సీట్లు ఉన్నట్లు తాజా జాబితా వెల్లడిస్తోంది. మరోవైపు నీట్ పీజీ రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌లోనూ మార్పులు చేశారు. నవంబర్ 10 నుంచి ఛాయిస్ ఫిల్లింగ్ ప్రారంభం కాగా, నవంబర్ 14 మధ్యాహ్నం 3 గంటల వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. కొత్తగా మంజూరైన సీట్లతో వైద్య విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి.

భారత్‌తో వన్డే సిరీస్..

న్యూజిలాండ్‌కు గాయాల దెబ్బ



దశ, హైదరాబాద్: భారత్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఇప్పటికే 02తో వెనుకబడిన న్యూజిలాండ్‌కు గాయాల సమస్యలు మరింత ఇబ్బందికరంగా మారాయి. కీలక పేసర్లు లూకీ ఫెర్గూసన్, బ్లేయర్ టిక్నర్ మిగిలిన రెండు వన్డేలకు దూరమయ్యారు. దీంతో బౌలింగ్ విభాగంలో కివీస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. పిక్క కండరాల గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో స్టార్ పేసర్ లూకీ ఫెర్గూసన్ సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు అందుబాటులో ఉండదని న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. టీ20 సిరీస్ సమయంలో గాయపడిన అతడు కోలుకునేందుకు మరికొంత సమయం అవసరమని వైద్య బృందం భావించింది. మరోవైపు వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తుండగా బంతి హెల్మెట్‌కు తగలడంతో బ్లేయర్ టిక్నర్ మైదానం వీడాడు. వైద్య పరీక్షల్లో కంకషన్ లక్షణాలు కనిపించకపోయినా, ఐసీసీ నిబంధనల ప్రకారం ఏడు రోజుల స్టాండ్‌డౌన్ వ్యవధి తప్పనిసరి కావడంతో అతడు మూడో, నాలుగో వన్డేలకు దూరమయ్యాడు.

టిక్నర్ స్థానంలో బౌలింగ్ ఆల్‌రౌండర్ క్రిస్టియన్ క్లార్క్‌ను మూడో వన్డే కోసం జట్టులోకి తీసుకున్నారు. మరో సీనియర్ పేసర్ మాట్ హెన్రీని నాలుగో వన్డే నాటికి అందుబాటులోకి తీసుకురావాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. టెస్టు సిరీస్ సన్నాహకాల కోసం మూడో వన్డే అనంతరం వెల్లింగ్టన్ వెళ్లాల్సిన మాట్ హెన్రీ, కైల్ జేమీసన్‌లు నాలుగో వన్డే వరకు జట్టుతోనే కొనసాగనున్నారు.

ఇప్పటికే డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్ గాయాల కారణంగా వన్డే సిరీస్‌కు దూరమయ్యారు. వరుస గాయాలతో ప్రధాన ఆటగాళ్ల సేవలను కోల్పోతున్న కివీస్‌కు భారత్‌తో మిగిలిన మ్యాచ్‌లు సవాల్‌గా మారాయి.

మూడో వన్డేకు న్యూజిలాండ్ జట్టు:
మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టామ్ లాథమ్, డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫెర్ట్, నాథన్ స్మిత్, విల్ యంగ్.

నాలుగో వన్డేకు న్యూజిలాండ్ జట్టు:
మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మిచెల్ హే, మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టిమ్ సీఫెర్ట్, విల్ యంగ్.

పార్కుల్లోనే ఇక ఆఫీస్ పని!

సైబరాబాద్‌లో 'వర్క్ ఫ్రం పార్క్' కాన్సెప్ట్‌కు శ్రీకారం

తొలి విడతలో రెండు పార్కుల అభివృద్ధి.. జనవరి 1 నుంచి అందుబాటులోకి




దశ, హైదరాబాద్: ఐటీ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, స్టార్టప్ నిర్వాహకులకు సరికొత్త పని వాతావరణాన్ని అందించేందుకు సైబరాబాద్ నగరపాలక సంస్థ (సీఎంసీ) వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ఇంటి నుంచే పనిచేసే ఉద్యోగులు ఇకపై పార్కుల్లోని పచ్చని చెట్ల మధ్య కూర్చొని తమ విధులు నిర్వహించుకునేలా 'వర్క్ ఫ్రం పార్క్' కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. దుబాయ్‌లో విజయవంతమైన ఈ విధానాన్ని సైబరాబాద్‌లోనూ అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రస్తుతం వర్క్ ఫ్రం హోమ్ విధానంలో పనిచేస్తున్న చాలామంది ఉద్యోగులు రోజంతా ఇంటికే పరిమితం కావడంతో విసుగు, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కార్యాలయాలకు వెళ్లాలంటే నగర ట్రాఫిక్‌లో గంటల సమయం గడపాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటికి సమీపంలోని పార్కుల్లోనే ప్రశాంతమైన వాతావరణంలో పనిచేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు, ఫ్రీలాన్సర్లు, చిన్న కంపెనీల సిబ్బంది, స్టార్టప్‌ల నిర్వాహకులకు ఈ సదుపాయం ఉపయోగపడనుంది.

సీఎంసీ పరిధిలో మొత్తం 30 పార్కులను 'వర్క్ ఫ్రం పార్క్' విధానంలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా తొలి విడతలో రెండు పార్కుల్లో పనులు ప్రారంభించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మజీద్‌బండ (మాధవహిల్స్)లో 1.5 ఎకరాల విస్తీర్ణంలో, కూకట్‌పల్లి పరిధిలోని మాదాపూర్‌లో ఒక ఎకరా విస్తీర్ణంలో ఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. జనవరి 1 నాటికి వీటిని ప్రారంభించనున్నట్లు సీఎంసీ కమిషనర్ సృజన వెల్లడించారు.

ఉద్యోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేసుకునేందుకు పార్కుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎత్తైన చెట్ల మధ్య ప్రత్యేక గదులు, కుర్చీలు, ఉచిత హైస్పీడ్ వైఫై, కోవర్కింగ్ సీటింగ్ సదుపాయాలు కల్పించనున్నారు. అంతేకాకుండా కెఫెటేరియా, స్టార్టప్ థీమ్ మీటింగ్ హాళ్లు, యాంఫీ థియేటర్ ఏర్పాటు చేయనున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ పాయింట్లు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. పార్కుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

ఈ పార్కులు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉండనున్నాయి. ఉద్యోగులు, సందర్శకుల నుంచి నామమాత్రపు ఛార్జీలు వసూలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. తొలి రెండు పార్కులకు ప్రజల నుంచి వచ్చే స్పందనను పరిశీలించిన అనంతరం మిగిలిన 28 పార్కులను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేయనున్నారు. వర్క్ ఫ్రం హోమ్‌కు ప్రత్యామ్నాయంగా పచ్చని వాతావరణంలో పనిచేసే అవకాశాన్ని కల్పించడంతో పాటు నగరంలో ఆధునిక వర్క్‌స్పేస్‌లకు కొత్త రూపు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.



జనవరి 25 నుంచి రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ

జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ జనగణనకు అవకాశం

మార్చి 1 నుంచి 5 వరకు రివిజనల్ రౌండ్.. జీఓ 155 జారీ

హైదరాబాద్, నవంబర్ 9

తెలంగాణలో జనగణన2027 రెండో విడత నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఇంటింటి సర్వే ద్వారా జనాభా వివరాలను సేకరించనున్నారు. అంతకుముందు జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 155ను జారీ చేసింది. స్వీయ జనగణనలో భాగంగా ప్రజలు ప్రత్యేకంగా అందుబాటులోకి తీసుకురానున్న యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ఈ వెసులుబాటు కల్పించారు. స్వీయ జనగణన గడువు ముగిసిన అనంతరం జనవరి 25 నుంచి జనగణన సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుంది. అనంతరం సేకరించిన వివరాల పరిశీలన, అవసరమైన సవరణల కోసం మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు రివిజనల్ రౌండ్ నిర్వహించనున్నారు. జనగణనకు సంబంధించి 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా (రెఫరెన్స్ డేట్) నిర్ణయించారు. జనాభా వివరాల లెక్కింపునకు ఈ తేదీని ప్రాతిపదికగా తీసుకుంటారు. కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయం అక్టోబర్ 30న విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 9న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన అధికారులకు పంపించింది.

జనగణన తొలి విడతలో భాగంగా రాష్ట్రంలో ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రక్రియను గత ఏడాది మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించారు. తాజాగా రెండో విడత జనాభా లెక్కల సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సిబ్బంది నియామకం, శిక్షణ, ఇతర సన్నాహక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దేశ జనాభా పరిస్థితి, కుటుంబాల స్థితిగతులు, సామాజిక, ఆర్థిక అంశాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని జనగణన అందిస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, వనరుల కేటాయింపు, అభివృద్ధి ప్రణాళికల తయారీలో ఈ గణాంకాలు కీలకంగా ఉపయోగపడనున్నాయి. జనగణన సిబ్బందికి ప్రజలు సరైన వివరాలు అందించాలని అధికారులు సూచిస్తున్నారు.

2028 డిసెంబర్ నాటికి కొడంగల్‌కు..

మొదటి పేజీ తరువాయి

నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులు దశాబ్దాలు గడిచినా ఆశించిన పురోగతి సాధించలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు రాలేదని, మక్తల్‌నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు పక్కన పెట్టారని ఆరోపించారు. కొడంగల్ ప్రాంతానికి పరిశ్రమలను తీసుకువచ్చి వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాజేంద్రనగర్ నుంచి చేవెళ్ల, షాబాద్, పరిగి మీదుగా కొడంగల్ వరకు రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు పారిశ్రామిక వృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని నీటి ఎద్దడి ఏర్పడిందని సీఎం పేర్కొన్నారు. పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అందరూ సమష్టిగా ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వచ్చే సంక్రాంతి తర్వాత 'ప్రజాబలం' కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానని ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సన్నబియ్యం సరఫరాపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒక సీజన్‌లో వరి పండించకపోయినా ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు ప్రభుత్వ వద్ద ఉన్నాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి, ఎంపీలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఫ్రీగా వెండి నాణేల పంపిణీ..

చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు, ఈనెల 11 వరకే..!

హైదరాబాద్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉచిత వెండి నాణేల పంపిణీ ప్రారంభమైంది. ఆదివారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన 'అమ్మవారి ఖజానా' పంపిణీ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వెండి నాణేలను స్వీకరించేందుకు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. నాణేల కోసం భక్తులు బారులు తీరడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. గుల్జార్ హౌస్ వరకు సుమారు 500 మీటర్ల మేర క్యూలైన్లు ఏర్పడ్డాయి. రద్దీని నియంత్రించేందుకు ఆలయ కమిటీ నాలుగు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేసింది. చార్మినార్ పరిసరాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. అమ్మవారి వెండి నాణేలను ఇంటికి తీసుకెళ్తే శుభం కలుగుతుందని, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ వరకు భక్తులకు ఉచితంగా వెండి నాణేలు పంపిణీ చేయనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com